క్లుప్తంగా

అర్బన్ సీఐ హమీద్‌ఖాన్‌కు సన్మానం



సీఐ హమీద్‌ఖాన్‌ను సన్మానిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా, తదితరులు

తాడిపత్రి అర్బన్: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇటీవల అర్బన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన హమీద్‌ఖాన్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ఆధ్వర్యంలో నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ రంగనాథ్‌రెడ్డి, నాయకులు రామశేఖర్, బాబయ్య, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పామిడికి ఫుడ్ కమిషన్ చైర్మన్ రాక

పామిడి: ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయప్రతాప్‌రెడ్డి మంగళవారం పామిడికి రానున్నారు. ఉదయం 10 గంటలకు పామిడి బైపాస్‌లోని అంగన్‌వాడీ కేంద్రం-2ను సందర్శిస్తారు. 11 గంటల నుంచి స్థానిక దళితవాడ, నాగిరెడ్డికాలనీ ఎంపీపీఎస్ పాఠశాలలను తనిఖీ చేస్తారు. 11:30 గంటలకు స్థానిక పీహెచ్‌సీని సందర్శించనున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

యాడికి: మండలంలోని చందన గ్రామ సమీపంలోని పేకాట స్థావరంపై సోమవారం ఎస్‌ఐ గురు ప్రసాద్ రెడ్డి దాడి చేశారు. రూ 25,800 నగదు స్వాధీనం చేసుకుని, 8 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు.

మట్కా, పేకాట ఆడితే జైలుకే

యల్లనూరు: మండల వ్యాప్తంగా ఎక్కడైనా మట్కా, పేకాట ఆడినా, ప్రోత్సహించినా జైలుకు పంపుతామని ఎస్‌ఐ రామకృష్ణ హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. మట్కా, పేకాట ఆడితే 9440901889 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

యూనిఫాం పంపిణీ




విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న వైస్ ఎంపీపీ విజయ, సర్పంచ్ నాగమునెమ్మ

శింగనమల: ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులు ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ విజయ అన్నారు. సోమవారం సాయంత్రం శింగనమలలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. నాడు–నేడు కింద వసతి గృహాలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందన్నారు. వసతి గృహాల్లో నాణ్యమైన పౌష్టికాహారం అందించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగమునెమ్మ, ఏఎస్‌డబ్ల్యూఓ పక్కీరయ్య, వార్డెన్ ఇర్షాద్ అహమ్మద్ పాల్గొన్నారు.

కంపచెట్ల తొలగింపు

పెద్దవడుగూరు: క్రిష్టిపాడు గ్రామం వద్ద రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లను వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లేశ్వరరెడ్డి సోమవారం సొంత ఖర్చులతో జేసీబీ ఏర్పాటు చేసి తొలగించారు. యాడికి సర్కిల్ సీఐ శంకర్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులు సూచనలతో కడదరగుట్టపల్లి వద్ద నుంచి హైవే రోడ్డు వరకు కంపచెట్లను తొలగించడం జరిగిందని పేర్కొన్నారు.

శనగలగూడూరులో 30 పోలీస్‌యాక్ట్



బందోబస్తు చేపట్టిన పోలీసులు

పుట్లూరు: మండలంలోని శనగలగూడూరులో 30 పోలీస్‌యాక్ట్ అమలు చేసినట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామస్తుల మధ్య ఏర్పడిన వివాదాన్ని పరిష్కరించడానికి అధికారులు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే గ్రామంలో పోలీస్ పికెట్ కొనసాగుతోందన్నారు. కొత్త వ్యక్తులు అనుమతి లేకుండా గ్రామంలోకి ప్రవేశించరాదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేత కార్మికులకు సన్మానం



నేత కార్మికులను సన్మానించిన మండల ఖాదీ సంస్థ సభ్యులు

యాడికి: అరవై ఏళ్లు దాటినా కూడా పలువురు మగ్గం నేయడం అభినందనీయమనీ ఖాదీ బోర్డు సభ్యుడు చంద్రమౌళి అన్నారు. సోమవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గుత్తి రోడ్డులోని చౌడేశ్వరీ కల్యాణ మండపంలో మండలంలోని 11 మంది నేత కార్మికులను విశాలాక్షి ఖాదీ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఖాదీ ఫెడరేషన్ ప్రెసిడెంట్ హరి ప్రసాద్, ఇస్మాయిల్, రజాక్ ఖాదీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



తాడిపత్రి అర్బన్: మహిళకు ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



పామిడి: సంక్షేమ పథకాల బ్రోచర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

తాడిపత్రి అర్బన్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పోలీస్ స్టేషన్ సమీపంలోని 6వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి.. వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఎవరికైనా అర్హత ఉండి సంక్షేమ పథకాల అందడంలో జాప్యం కలిగితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయడమే లక్ష్యమన్నారు. ఏ ఒక్కరూ ప్రభుత్వ పథకాల కోసం ఎదురుచూడకూడదని.. ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. అనంతరం నవరత్నాల్లోని పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాబర్ట్, నాయకులు డివి.కుమార్, లక్ష్మీరంగయ్య, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మనోజ్, సూర్యప్రభాకర్‌బాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా నేనున్నా

యాడికి: అధైర్యపడొద్దు.. మీకు అండగా నేనున్నా అంటూ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు భరోసా కల్పించారు. మండలంలోని బోయరెడ్డిపల్లెలో ఇటీవల టీడీపీ గూండాల దాడిలో గాయపడి కోలుకుంటున్న వైఎస్సార్‌సీపీ వర్గీయులు వెంకటశివ, మారుతి, మంజునాథ, రాజు, నాగేష్‌ను సోమవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. దాడికి దారితీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మీరు ఎవ్వరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. మీకు ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పలు సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందుతున్నాయన్నారు. ఏదైనా సమస్య వస్తే అరగంటలో మీ ముందు ఉంటానని తెలిపారు. గత 40 ఏళ్లుగా జేసీ బ్రదర్స్ వెంట ఉన్నా కూడా మాకు ఏ సహాయ సహకారాలు అందలేదని వైఎస్సార్‌సీపీలో చేరిన వారు తెలిపారు. మమ్మల్ని ఎవ్వరూ ప్రలోభ పెట్టి వైఎస్సార్‌సీపీలో చేర్పించలేదని వెల్లడించారు. మేమే స్వచ్ఛందంగా చేరితే.. ఇది జీర్ణించుకోలేని టీడీపీకి చెందిన పెద్దయ్య వర్గీయులు ఇలా దారి కాచి దాడి చెయ్యడం సిగ్గుచేటని మండిపడ్డారు. అంతకుముందు ఎమ్మెల్యే మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల నాయకులు కార్యకర్తలతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెన్నప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, శివరామిరెడ్డి, కమలపాడు సచివాలయం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన

పామిడి: ముఖ్యమంత్రి జగనన్నతోనే సంక్షేమ పాలన సాధ్యమని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రామరాజుపల్లిలో ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, సర్పంచ్ టీసీ ముత్యాల్‌రెడ్డి సారథ్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. తొలుత గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే వైవీఆర్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, గుంతకలు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతీరెడ్డికి అపూర్వ స్వాగతం లభించింది. ఈ సందర్భంగా వారు గ్రామ వీధుల్లో ముమ్మరంగా పర్యటించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటు, హౌసింగ్, పింఛన్లు, పంటనష్ట పరిహారం వర్తింపు తదితర సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే వైవీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ పరంగా ఎటువంటి లబ్ధి చేకూరని తనకు పింఛన్ అందించాలని లక్ష్మమ్మ కోరింది. బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న టీసీ ముత్యాల్‌రెడ్డి ఆపరేషన్‌కు అయ్యే ఖర్చును మంజూరు చేయించాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలంటూ ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, ఈఓఆర్డీ టీవీ శశికళకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే వైవీఆర్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ సర్కారు పాలన సాగిస్తోందన్నారు. ప్రజాదరణ తగ్గడంతో మాజీ సీఎం చంద్రబాబు సహనం కోల్పోయారన్నారు. తమ్ముళ్లను రెచ్చగొట్టి, దాడులకు పురిగొల్పుతున్నారని మండిపడ్డారు. పుంగనూరు సంఘటన బాబు నీచ రాజకీయ సంస్కృతికి నిలువెత్తు నిదర్శనమన్నారు. అధికారం కోసం మోసపూరిత హామీలు ఇస్తున్న బాబు, సినీ డైలాగ్‌లతో మాటల గారడి చేస్తున్న పవన్‌ను ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయన్నారు. కార్యక్రమంలో పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, పట్టణ సచివాలయాల కన్వీనర్ బి.ఆసిఫ్, జోజుదే కుమార్, ఆర్‌సీ వెంకట్రామిరెడ్డి, బోయ రామచంద్ర, అనుంపల్లి సూరి, ముస్లిం మైనార్టీ నాయకులు సీ అబ్దుల్ రజాక్, దాదా, ఆదామ్, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు మూలి నాగేశ్వర్‌రెడ్డి, సర్పంచులు వై.సూర్యనారాయణ, రామశేఖర్‌రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, బొల్లు వెంకట్రామిరెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకట్రామిరెడ్డి, ఓబులేసు, శీనా, బయపరెడ్డి, నెల్లి హనుమంతరెడ్డి, హరినాథ్‌రెడ్డి, నక్కా ఓబులేసు, ఎంహెచ్ అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ పరిశీలన

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని చెర్లోపల్లిలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ భవనాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు సోమవారం పరిశీలించారు. త్వరలోనే హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ సాయి, బిల్లు కలెక్టర్ చంద్ర, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

గార్లదిన్నె: మండల పరిధిలోని శిరివరంలో ఇటీవల నూతనంగా నిర్మించిన ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ తేజోత్స్న సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

పామిడి: మండలంలోని ఎదురూరు, అక్కజాంపల్లి గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి హాజరుకానున్నారు.

నార్పల: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం బొందలవాడ గ్రామానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి వస్తారని మండల కన్వీనర్, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి తెలిపారు.

ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని బసినేపల్లి గ్రామ శివారులో సోమవారం బైక్ అదుపు తప్పిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం గోరుమానుపల్లికి చెందిన రామన్న, తిప్పయ్యస్వామి వ్యక్తిగత పని నిమిత్తం గుత్తికి బయలేదేరారు. బసినేపల్లి శివారులో వీరు ప్రయాణిస్తున్న వాహనానికి కుక్క అడ్డుగా రావడంతో కిందపడ్డారు. గాయపడిన వీరిని వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

తాడిపత్రి అర్బన్: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సీబీ రోడ్డులోని మార్కండేయ స్వామి ఆలయంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నంద్యాలకు చెందిన శాంతిరామ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సిబ్బంది.. వృద్ధులకు కంటి పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. మరికొందరిని శస్త్ర చికిత్సల కోసం శాంతిరామ్ ఆసుపత్రికి తరలించారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు గడ్డం గణేష్, ఉపాధ్యక్షుడు చెన్న రంగప్రసాద్, ప్రధాన కార్యదర్శి జానపాటి శివశంకర్, జాయింట్ సెక్రెటరీ గడ్డం పరమేష్, కోశాధికారి హరి పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

- ముగ్గురు కూలీలకు గాయాలు

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి వద్ద సోమవారం కూలీలతో వెళుతున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి బండల లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ఉన్న హాజీవలి, రామతులసి, ఇందు గాయపడ్డారు. వివరాల్లోకెళితే.. జక్కల చెరువు గ్రామానికి చెందిన సుమారు పది మంది కూలీలు ట్రాక్టర్‌లో బసినేపల్లి తండాలో కూలీ పనులకు బయలు దేరారు. అయితే మార్గం మధ్యలోని గుత్తి ప్రభుత్వాస్పత్రి వద్ద ట్రాక్టర్‌ను వెనుక నుంచి బండల లారీ ఢీ కొనింది.ఈ ప్రమాదంలో కూలీలు హాజీవలి, రామ తులసి, ఇందు గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన లారీని, లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు రూ.1.05 లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని పాతబస్టాండ్‌లో పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి రూ.1.05 లక్షల చెక్కును అందజేశారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో భవన నిర్మాణ సంఘం నాయకులు మేస్త్రీ దొడ్డప్ప, రామాంజినేయులు, మస్తాన్‌లకు ఈ మొత్తాన్ని అందజేశారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ముని వైద్య ఖర్చులకు రూ.50 వేలు అందజేశారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ కౌన్సిలర్ శంకర్‌ను వైఎస్సార్‌సీపీ యువనాయకుడు మంజునాథరెడ్డి పరామర్శించారు. వైద్య ఖర్చులకు ఆర్థికసాయం అందజేశారు.

జగదీష్ కుటుంబాన్ని ఆదుకుంటాం



జగదీష్ కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఆలూరి సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని హైస్కూల్ కొట్టాలకు చెందిన జగదీష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. తాను చనిపోతూ గుండె, కిడ్నీ, ఊపిరితిత్తులను దానం చేశాడు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి సోమవారం జగదీష్ తండ్రి నరసింహులు, తల్లి వెంకటలక్ష్మి, భార్య రోజాను పరామర్శించారు. రోడ్డు ప్రమాదంపై ఆరా తీశారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి రూ.50 వేలు, ఎంపీటీసీ కాలువ వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కాలువ నారాయణస్వామి సమకూర్చిన రూ.10 వేల ఆర్థికసహాయాన్ని ఆలూరి సాంబశివారెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రభుత్వం నుంచి రూ.5 లక్షల సహాయం అందించేలా కృషి చేస్తామన్నారు. ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, బీకేఎస్ మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి, నాయకులు పూల నారాయణస్వామి, చికెన్ నారాయణ స్వామి, బుల్లే నారాయణ స్వామి, సాయి, పూల రంగా, కొండప్ప, పురుషోత్తం, కొండన్న, శ్రీనివాసరెడ్డి, సాకే లక్ష్మి నారాయణ, చంద్రమోహన్ పాల్గొన్నారు.

పరామర్శ..

బుక్కరాయసముద్రం: అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మాజీ ఎంపీపీ చెన్నంపల్లి గువ్వల రాజశేఖర్‌రెడ్డి, ఎస్సీ సెల్ నాయకుడు వరికూటి కాటమయ్యను ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ భాస్కర్ పరామర్శించారు. నాయకుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చెదుల్ల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, చికెన్ నారాయణస్వామి, కొర్రపాడు ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, సాకే లక్ష్మీనారాయణ, జగదీశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్



ప్రజలకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి

యాడికి: సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదలకు అండగా నిలిచారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కమలపాడులో ఆయన పర్యటించారు. సచివాలయ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల బ్రోచర్లు అందజేశారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెన్నప్ప, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, బోగాతి బ్రహ్మానంద రెడ్డి, మాజీ సర్పంచ్ భీమేశ్వర రెడ్డి, నాయకులు భాస్కర్ రెడ్డి, జయుడు, హరీష్ రెడ్డి, లోకేష్ రెడ్డి, శివ ప్రసాద్ పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: వార్డుల్లో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే ఎమ్మెల్యే పెద్దారెడ్డి దృష్టికి తీసుకురావాలని యువ నాయకుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని నందపాడు సచివాలయ పరిధిలో హర్షవర్ధన్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అంటూ ఆప్యాయంగా ప్రజలను పలకరించారు. వార్డుల్లో అండర్ డ్రైనేజీ సమ్యలు, విద్యుత్ సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పేరం ప్రతాప్‌రెడ్డి, సునీల్, అలీ తదితర నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



ఉమామహేశ్వరరెడ్డి (ఫైల్)

పెద్దవడుగూరు: మండల పరిధిలోని గుత్తిఅనంతపురం గ్రామానికి చెందిన ఉమామహేశ్వరరెడ్డి కనిపించడం లేదని అతని తండ్రి చిన్నముత్యాలరెడ్డి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గత నెల 31వ తేదీన గుంతకల్లుకు వెళ్తున్నాని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన ఉమామహేశ్వరరెడ్డి ఇప్పటి వరకూ రాలేదని తెలిపాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440796826, 9491308871 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఫుట్‌పాత్‌ను ఢీకొన్న బైక్

- ఐదుగురికి గాయాలు

తాడిపత్రి: మండల పరిధిలోని వరాలు తోట సమీపంలోని పెన్నా నది బ్రిడ్జిపై సోమవారం బైక్ అదుపుతప్పి ఫుట్‌పాత్‌ను ఢీట్టింది. ఈ ఘటనలో 5 మందికి గాయాలయ్యాయి. సజ్జలదిన్నె గ్రామానికి చెందిన షౌకత్ వలి తన కుమార్తె మొహతాజ్‌తో పాటు బంధువుల పిల్లలైన అభిదా, మస్తాన్‌వలి, మహమ్మద్ యూనిస్‌ను బైక్‌పై ఎక్కించుకుని తాడిపత్రికి బయలుదేరాడు. మార్గమధ్యంలో పెన్నానది బ్రిడ్జిపైకి రాగానే బ్రిడ్జిపై ఉన్న ఫుట్‌పాత్‌ను ఢీకొని కింద పడ్డారు. ఈ ప్రమాదంలో బైక్‌లో ప్రయాణిస్తున్న 5 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వీరిని చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఆస్తి విషయంలో ఘర్షణ

పెద్దపప్పూరు: మండలంలోని అమ్మలదిన్నె కొత్తపల్లిలో ఆదివారం అర్ధరాత్రి ఆస్తి విషయంలో బావ బావమరిది గొడవ పడ్డారు. వివరాలు.. కొత్తపల్లికి చెందిన దుర్గాప్రసాద్ తన అక్కను శింగనమల మండలం సలకం చెరువు గ్రామానికి చెందిన బిందెల ఈశ్వరయ్యకు ఇచ్చి వివాహం చేశారు. ఆదివారం రాత్రి ఈశ్వరయ్య అతడి భార్య కొత్తపల్లికి వచ్చి ఆస్తి విషయంలో గొడవ పడ్డారు. ఇరువర్గాల మధ్య జరిగిన తోపులాటలో ఈశ్వరయ్య బండరాయిపై పడటంతో తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు అతడ్ని చికిత్స నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

క్రికెట్ గ్రౌండ్ కబ్జాపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాచుపల్లి క్రీడాకారులు

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లి గ్రామంలో తాము రోజు క్రికెట్ ఆడే గ్రౌండ్‌ను కొందరు కబ్జా చేశారని గ్రామానికి చెందిన క్రీడాకారులు తహసీల్దార్ మహబూబ్ బాషాకు వినతిపత్రం అందజేశారు. సోమవారం సర్పంచ్ కర్లకుంట రమేష్ బాబు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన సుమారు వంద మంది క్రీడాకారులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని సమస్యను వివరించారు. గ్రామ శివారులోని సర్వే నంబర్ 188లో ఉన్న 18 ఎకరాల భూమిలో గత 15 సంవత్సరాలుగా తాము క్రికెట్ ఆడుతున్నామన్నారు. అయితే నెల రోజుల క్రితం గ్రామానికి చెందిన కొందరు సర్వే నంబర్ 188లో అక్రమంగా పట్టాదారు పాసుపుస్తకాలు చేసుకున్నారని తెలిపారు. అధికారులు స్పందించి సదరు భూమిని క్రీడా మైదానానికి కేటాయించాలన్నారు. అలాగే మైదానం చుట్టూ ఫెన్సింగ్ వేయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు వెంకట్రాముడు, నరసింహులు, క్రీడాకారులు ఈబుది యువరాజ్, టి.రామంజి, టి.లక్ష్మయ్య, ఎస్.రఘు పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

నార్పల: మండల వ్యాప్తంగా ఖాళీగా ఉన్న వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనట్లు ఎంపీడీఓ దివాకర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎనిమిదో వార్డు (జనరల్), హెచ్.సోదనపల్లి పంచాయతీలోని మూడవ వార్డు (ఎస్సీ మహిళ), ఐదో వార్డు (ఎస్సీ జనరల్)కు కేటాయించడం జరిగిందన్నారు. నామినేషన్లు 8వ తేదీ నుంచి 10వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు మాత్రమే దాఖలు చేసుకోవాలన్నారు. 11వ తేదీ నామినేషన్ల పరిశీలన, 14వ తేదీ నామినేషన్లు ఉపసంహరణ, 19వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు, అదే రోజు మధ్యాహ్నం రెండు నుంచి ఓట్ల లెక్కింపు జరుగుతుందని వెల్లడించారు.

తాడిపత్రి: నియోజక వర్గంలోని పంచాయతీల్లో ఖాళీగా ఉన్న సర్పంచ్, వార్డు మెంబర్ల స్థానాలకు ఈనెల 19న ఉప ఎన్నికలు జరగనున్నాయి. తాడిపత్రి మండలంలోని దిగువపల్లి 9వ వార్డు, యాడికి మండలంలోని నగరూరు గ్రామంలోని 1వ వార్డు, వెంగన్నపల్లి గ్రామంలోని 5వ వార్డు, రాయల చెరువులో 12వ వార్డు, యాడికి మండల కేంద్రంలోని 19వ వార్డు, పెద్దవడుగూరు మండలంలోని జి. వెంకటాంపల్లి గ్రామంలో 4వ వార్డు, పెద్దపప్పూరు మండలంలోని చిన్నఎక్కలూరు గ్రామంలోని 8వ వార్డు స్థానాలతో పాటు, దేవుని ఉప్పలపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానానికి ఉప ఎన్నికలు జరగనున్నాయి.

యల్లనూరు: మండలంలో ఖాళీగా ఉన్న సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. జంగంపల్లి సర్పంచ్ స్థానం, పాతపల్లి 6వ వార్డు, బొప్పేపల్లి 3వ వార్డులకు ఎన్నికలు జరుగుతాయని ఎంపీడీఓ వీరరాజు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

లింగ నిర్ధారణ నియంత్రణ చట్టంపై అవగాహన

పెద్దవడుగూరు: లింగ నిర్ధారణ నియంత్రణ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ శ్రీనివాసబాబు పేర్కొన్నారు. సోమవారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. లింగ నిర్ధారణ నియంత్రణ చట్టాలన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయ్‌భాస్కర్, కేజీబీవీ ఎస్‌ఓ ఉమాదేవి, సీహెచ్‌ఓ చిట్టితల్లి, ఆరోగ్య విస్తరణ అధికారి వినయ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బలిజ సంఘం నాయకుల సంబరాలు

గుత్తి: విజయనగర సామ్రాజ్య అధినేత శ్రీకృష్ణదేవరాయలు రాజుగా పట్టాభిషేక్తుడైన రోజును పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద బలిజ సంఘం నాయకులు, సభ్యులు, బలిజ కులస్తులు సంబరాలు జరుపుకున్నారు. పరస్పరం స్వీట్లు తినిపించుకున్నారు. శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో గుత్తి బలిజ జంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు మారాకుల రమణ, కోశాధికారి మంజు, పగడాల శ్రీనివాసులు, రాము, శ్రీకరం వెంకటేష్, నాని, సురేష్, వెంకట స్వామి, రఘు, శివ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

టీకాలు తప్పనిసరిగా వేయాలి

గార్లదిన్నె: మండల కేంద్రంలోని సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను వైద్య సిబ్బంది సోమవారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీ డాక్టర్ షమీన్ తాజ్ మాట్లాడుతూ.. అనివార్య కారణాలు వల్ల వ్యాధి నిరోధక టీకాలు తీసుకోక పోతే వారందరికీ వారం రోజులు పాటు మిషన్ ఇంద్రధనుస్సు కార్యక్రమం ద్వారా వ్యాక్సిన్ ఉచితంగా వేస్తామన్నారు. అలాగే ఆయా గ్రామాల్లో ఆశావర్కర్లు సర్వే చేపట్టాలన్నారు. ఎల్లలకు సకాలంలో వ్యాక్సిన్ వేయాలన్నారు. అనంతరం ఇంద్రధనుస్సు పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లోక్‌నాథ్, సూపర్‌వైజర్ విశ్వనాథ్ రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ విశాలాక్షి

గుత్తి రూరల్: ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో గ్రామ పంచాయతీల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గత మూడు నెలల్లో అన్ని శాఖల్లో జరిగిన ప్రగతి, ప్రతిపాదనలపై చర్చించారు. ఊబిచెర్ల గ్రామంలో డ్రైనేజీ కాలువలు నిర్మించాలని, ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని సర్పంచ్ చిదంబరి కోరారు. యంగన్నపల్లిలో వీధి దీపాలు, నీటి సమస్యపై సర్పంచ్ భరత్‌కు మార్ నిరసన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహ బూబ్ బాషా, వైస్ ఎంపీపీలు తిరుపాలమ్మ, నాగేశ్వరమ్మ, ఎంఈఓ రవినాయక్, ఏఓ ముస్తాక్ అహ్మద్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది అబ్దుల్, రాజేష్, వాసు, సర్పంచ్‌లు చిదంబరి, సుశీలమ్మ, అప్పా వెంకటేష్, రమేష్, రాజేశ్వరి, వాసుదేవరెడ్డి, చిన్న ఆంజనేయులు, గోపాల్, ఎంపీటీసీలు చిన్న వీరన్నగౌడ్, సుమలత, శంకరమ్మ, కార్యదర్శులు ధనలక్ష్మి, ప్రవీణ్ పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి

గుంతకల్లు రూరల్: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ నాయకులు సోమవారం ఆర్డీఓ రవీంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వెంకట్‌నాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వినోద్‌కుమార్ మాట్లాడారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో పెండింగ్‌లో ఉన్న కాస్మొటిక్ చార్జెస్, విద్యార్థులకు అవసరమైన ప్లేట్లు, బెడ్‌షీట్స్, ట్రంకు పెట్టెలు, మెడికల్ కిట్లు అందించాలన్నారు. బిల్డింగ్ పైకప్పు శిథిలావస్థకు చేరడంతో ప్రమాదకరంగా మారిందన్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టేలా చర్యలు చేపట్టాలని కోరారు.